క్లుప్తంగా

ముసురు వర్షం.. చల్లబడిన వాతావరణం



హిమాయత్‌నగర్‌లో గొడుగుతో వెళ్తున్న మహిళలు

మొయినాబాద్‌రూరల్: మండల, మున్సిపల్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షంతో వాతావరణం చల్లబడింది. బుధవారం సాయంత్రం వరకు వర్షం పడుతూనే ఉంది. దీంతో ప్రజలు ఎవరూ బయటకు రాకపోడవడంతో మండలంలో రోడ్లు, వీధులు నిర్మానుష్యంగా మారాయి.

కేపీఎన్‌పీఎస్ మహాసభలను విజయవంతం చేయండి

కేశంపేట: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 13న నిర్వహించనున్న కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి (కేపీఎన్‌పీఎస్) రెండో మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ మోహనకృష్ణ కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన పలువురు నాయకులతో కలిసి మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కుల అస్తిత్వ నిర్మూలన అనే అంశంతోనే కేపీఎన్‌పీఎస్ ఆవిర్భవించిందన్నారు. దళితులపైన జరిగిన దాడులకు వ్యతిరేకంగా పోరాటాలను చేసినట్టు తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తున్నట్టు స్పష్టం చేశారు. మహాసభలకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో కేపీఎన్‌పీఎస్ అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ

నందిగామ: మండల పరిధిలోని చేగూరులో ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు బుధవారం మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ గ్రామస్తులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ యువకులు స్వచ్ఛందగా ముందుకొచ్చి ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ముందుకు రావడం అభినందించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేటకు చెందిన గుండు చెన్నకేశవులు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడిది నిరుపేద కుటుంబం కావడంతో ఈ విషయాన్ని గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగదీశ్వర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2.50లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఇట్టి చెక్కును బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో బాధిత కుటుంబ సభ్యులకు ఆయన అందించారు.

అనుమతులు లేని స్కూళ్లపై చర్యలకు డిమాండ్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలో ప్రభుత్వ అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట ఏబీవీపీ నగర కార్యదర్శి నవీన్‌నాయక్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. పట్టణంలో కొనసాగుతున్న శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రశ్నించిన విద్యార్థుల తల్లిదండ్రులపై పాఠశాల యాజమాన్యం అక్రమ కేసులను పెట్టడం సరికాదన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులను వసూలుచేస్తూ అధిక ధరలకు పుస్తకాలను అమ్ముతూ తల్లిదండ్రులపై భారం మోపుతున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల్లో అమ్ముతున్న పుస్తకాలను విద్యాశాఖ అధికారులు సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు చందు, నవీన్, సాయి, మనోజ్, జశ్వంత్, మహేష్, ముకేష్, కార్తీక్, ప్రశాంత్, చరణ్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

షాబాద్: పశుసంపదను కాపాడుకునేందుకు రైతులు పశువైద్య సిబ్బందిని ఆశ్రయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల పరిధిలోని హైతాబాద్‌లో దత్తాత్రేయ గోశాలలో పశువులకు గొంతువాపు, తొడవాపు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులు అనారోగ్యానికి గురికాకుండా ప్రభుత్వం వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, రైతులు ఉన్నారు.

కొరవడిన చెత్త ‘శుద్ధి’

- నామమాత్రంగా తడి, పొడి చెత్త సేకరణ
- నిరుపయోగంగా మారిన సెగ్రిగేషన్ షెడ్లు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



బాకారంలో నిరుపయోగంగా చెత్త సేకరణ శుద్ధి షెడ్

మొయినాబాద్‌రూరల్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. అయితే, వీటి నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన షెడ్లు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేయడం ద్వారా వాటిలోని రసాయనిక పదార్థాలు భూమిలోకి చేరి తద్వారా నేల, నీరు కలుషితమవుతాయి. చెత్త కుళ్లిపోయి దుర్గంధం, కాల్చడంతో వెలువడిన పొగతో పర్యావరణం దెబ్బతింటుంది. దీంతో పల్లెల్లో కాలుష్యాన్ని నివారించి పర్యావరణ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం చేపట్టారు. కానీ నిర్వహణ లేకపోవడంతో షెడ్లు నేడు అనేక అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతున్నాయని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.2లక్షలతో నిర్మాణం

మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ నిధులతో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. అప్పట్లో మొయినాబాద్ మండలం 28 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఇందులో తొమ్మిది గ్రామ పంచాయతీలు మున్సిపల్ పరిధిలోకి వెళ్లాయి. మున్సిపల్ పరిధిలోకి వెళ్లిన తొమ్మిది గ్రామ పంచాయతీలు పక్కన పెడితే మిగతా 19 గ్రామ పంచాయతీలలో షెడ్లు నిరుపయోగంగా దర్శనం ఇస్తున్నాయి. పిచ్చిమొక్కలు పెరిగి కనబడకుండా ఉన్నాయి. ఉపాధి హామీ నిధుల నుంచి ఒక్కో షెడ్డుకు అప్పట్లో దాదాపు రెండు లక్షలకు పైగానే కేటాయించారు. ప్రతీ రోజు గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించే చెత్తను సెగ్రిగేషన్ షెడ్లకు తరలించాలి. కానీ ప్రత్యేక అధికారుల పాలనలో చెత్త సేకరణ నామమాత్రంగానే కొనసాగుతోంది. తడి, పొడి చెత్తను వేరుగా సేకరించి ఈ షెడ్లుల్లో నిర్మించిన గదుల్లో వేసి, చెత్తలోంచి సేంద్రియ ఎరువులను తయారు చేయాల్సి ఉంది. కానీ అలాంటి ప్రక్రియ మండలంలోనే కాదు రంగారెడ్డి జిల్లాలోనే ఎక్కడ జరగడం లేదనే సమాచారం. రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం చేపట్టింది. కానీ ఎక్కడ ఎరువులను తయారు కనబడడం లేదు.

చర్యలు తీసుకోవాలి

గ్రామాల్లో తడి, పొడి చెత్తతో ఎరువులను తయారు చేసి రైతులకు అందిస్తే పంచాయతీలకు ఆదాయం చేకూరుతుంది. గత ప్రభుత్వ హయాంలో ఎరువుల తయారీ కోసం షెడ్లను నిర్మించింది. కానీ వాటిని వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. బాకారంలో పిచ్చిమొక్కలు మొలిసి దర్శనమిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– కొత్తపల్లి తిరుపతిరెడ్డి, రైతు, బాకారం

ఎరువుల తయారీకి కృషి చేస్తాం

కాశీంబౌలిలో గత ప్రభుత్వ హయాంలో తడి, పొడి చెత్త వేరు చేసి తయారు చేసిన ఎరువులను రైతులకు అందించేందుకు షెడ్డును నిర్మించారు. కానీ గ్రామ పంచాయతీలో సిబ్బంది, కార్మికుల కొరతతో ఎరువులను తయారు చేయడం లేదు. త్వరలో తడి, పొడి చెత్తతో ఎరువు తయారు చేసేందుకు కృషి చేస్తాం.

– దేవేందర్‌రెడ్డి, కార్యదర్శి, కాశీంబౌలి

చెరువును తలపిస్తున్న రోడ్డు

- ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి కింద భారీగా చేరిన వర్షపునీరు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- శాశ్వత పరిష్కారం చూపని అధికారులు

శంకర్‌పల్లి: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి కింద పెద్దఎత్తున వర్షపు నీరు వచ్చి చేరి, చెరువును తలపిస్తోంది. దీంతో వికారాబాద్ వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే కొన్ని నెలల క్రితం ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, పోలీసులు సంయుక్తంగా కలిసి బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించి, అంతర్గత మురుగునీటి లైన్ వేయాల్సిందిగా నిర్ణయం తీసుకోగా.. నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



ఫత్తేపూర్ వద్ద రైల్వే బ్రిడ్జి కింద చేరిన వర్షపు నీరు

పిల్లలను బడిలో చేర్పించాలి

ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్: బడీడు పిల్లలను తల్లిదండ్రులు విధిగా బడిలో చేర్పించాలని ఎంఈఓ మనోహర్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని తిమ్మాజీపల్లి తండాలో ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా పాఠశాలల్లో చేర్పించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. చిన్నారులందరినీ చదివించి అక్షరాస్యతను పెంపొందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులను కల్పిస్తోందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. అదేవిధంగా విద్యార్థులకు పుస్తకాలు, నోటుబుక్స్, దుస్తులు, పౌష్టిక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రచారంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంఈఓ మనోహర్

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేస్తున్న సీఐ విజయ్‌కుమార్, సంస్థ సభ్యులు

సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్: విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పట్టణ సీఐ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని వెంకటేశ్వరకాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో జాతీయ మానవ హక్కుల, నేర నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పలకలు, వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని, దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సంఘం సభ్యులు సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మనోహర్, సంఘం అధ్యక్షుడు సురేష్‌సింగ్ రాజ్, సభ్యులు లక్కాకుల అనిల్‌కుమార్, చందనా జైన్, దుర్గాదేవి, హెచ్‌ఎం శశికళ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జైసంవిధాన్ సభను విజయవంతం చేద్దాం

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

మొయినాబాద్‌రూరల్: ఈ నెల 4వ తేదీన ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న జైబాపు, జైభీం, జైసంవిధాన్ బహిరంగ సభను విజయవంతం చేద్దామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీమ్‌భరత్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో గల కాంగ్రెస్ పార్టీ సమీపంలో భీమ్‌భరత్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అదేవిధంగా ఈ సమావేశంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, నారాయణపేట్ ఎమ్మెల్యే పర్ణికరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జై బాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే మహాసభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ సభలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మానయ్య, బిస నర్సింహ, భిక్షపతి, అల్లం శ్రీనివాస్‌రెడ్డి, హిమాయత్‌నగర్ కుమార్‌యాదవ్, భద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న దాత లక్ష్మీనారాయణగౌడ్

కేశంపేట: మండల పరిధిలోని లింగంధన గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ నిర్మాణానికి షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్ రూ.1.11లక్షల విరాళంను ప్రకటించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళానికి సంబంధించిన నగదును అందించారు. దాతలు ముందుకొచ్చి విరాళాలను అందించాలని వారు కోరారు. ఈ సందర్భంగా దాతను వారు అభినందించారు. కార్యక్రమంలో నాగిళ్ల చిన్న రామస్వామి, కృష్ణయ్య, జంగయ్య, కృష్ణ, బాబు, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

పీర్ల పండుగను ఘనంగా నిర్వహించాలి



ఉత్సవాలకు నగదును అందజేస్తున్న మాజీ సర్పంచ్ నర్సింలు

షాబాద్: కులమతాలకతీతంగా పీర్ల పండుగ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని సర్దార్‌నగర్ మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింలు అన్నారు. బుధవారం సర్దార్‌నగర్‌లో పీర్ల పండుగ ఉత్సవాల సందర్భంగా రూ.5,100ల నగదును ఆయన నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీర్ల పండుగ ఉత్సవాలు ఐకమత్యానికి, మత సామరస్యానికి చిహ్నంగా నిలుస్తాయన్నారు. సర్వమతసారం ఒక్కటేనని, మానవులందరూ సోదరభావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు అశోక్‌కుమార్, యాదయ్య, కలాం, రాకేశ్, హాజీ, సురేష్, యాదయ్య, నరేశ్, తదితరులు ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం

షాద్‌నగర్‌రూరల్: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని టీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని దేవీగ్రాండ్ హోటల్‌లో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు విషయమై దాటవేత ధోరణి కొనసాగుతోందన్నారు. జర్నలిస్టులు న్యాయమైన పరిష్కారం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వాలు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. అదేవిధంగా జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని, దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధనే లక్ష్యంగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జర్నలిస్టులు లక్కాకుల రమేశ్‌కుమార్, మల్లేశ్, శ్రీనివాస్, వెంకటయ్య, వహీద్, రామకృష్ణ, రమేశ్, నరేందర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్

వాహనదారులకు తప్పని ట్రాఫిక్ తిప్పలు

కేశంపేట: మండల కేంద్రంలో గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు తమ వాహనాలను ఇష్టానుసారంగా నిలుపుతుండడంతో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలతో పాటుగా పోలీస్‌స్టేషన్ పక్కనే ఉండటంతో ఆయా కార్యాలయాలకు వచ్చేవారు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో నాలుగువైపులా రోడ్డు ఉండటంతో భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు వచ్చినప్పుడు తీవ్రంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ట్రాఫిక్ పోలీసులు స్పందించి వాహనాలను రోడ్డుపై నిలపకుండా తగిన సూచనలు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఏర్పడిన ట్రాఫిక్ జామ్

ఆవిర్భావ వేడుకలకు తరలిరావాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్



దిమ్మె నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కొత్తూరు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సంఘం నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తరలిరావాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్‌మాదిగ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా బుధవారం మండలంలోని కొడిచర్ల, ఎస్బీపల్లి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మెల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహా మాట్లాడుతూ.. ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ప్రతీ గ్రామంలో సంఘం జెండాలను ఆవిష్కరించాలని కోరారు. అంతేకాకుండా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం నుంచి నేటివరకు సమాజ శ్రేయస్సు కోసం చేసిన సేవలు, వర్గీకరణ తదితర అంశాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ముఖ్యంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సేవలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, లింగం, లక్ష్మయ్య, సాయి, కిరణ్, శివశేఖర్, మోహన్, చింటు, శివ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ పంచాయతీ అవార్డులపై అవగాహన

కేశంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవిధంగా చూడాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య అన్నారు. మండల పరిధిలోని అల్వాల గ్రామ రైతు వేదికలో బుధవారం నేషనల్ పంచాయతీ అవార్డు 2023–24 సంవత్సరానికి సంబంధించిన విషయాలపై పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేకాధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. నేషనల్ పంచాయతీ అవార్డుల కోసం గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. గ్రామాల్లో పంచాయతీ ఇండెక్స్, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, పారిశుధ్యం, సీనియర్ సిటిజన్ సర్వీస్‌లు, వన మహోత్సవం, మంచినీటి సరఫరాలు, జీపీకి సంబంధించి అన్ని పనుల వివరాలను పొందుపర్చాలన్నారు. అన్ని వివరాలు పక్కాగా నమోదు చేసి అవార్డులకు పోటీలో ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రశేఖర్, ఏఓ శిరీష, పీఆర్ ఏఈ నర్సింగ్‌రావు, ఏపీఎం భగవంతు, ఏపీఓ అజీజ్, మండల పశువైద్యాధికారి డాక్టర్ నివేదిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్యాసింగ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కార్యదర్శులు

పప్పుధాన్యాల సాగుతో అధిక దిగుబడులు

మండల వ్యవసాయాధికారి అనురాధ

మొయినాబాద్: రైతులు పప్పుధాన్యాల పంటలను సాగు చేసి అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయాధికారి అనురాధ అన్నారు. మొయినాబాద్ రైతు వేదికలో బుధవారం ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం పథకంలో భాగంగా ఎల్‌ఆర్‌జీ–52 రకం కంది విత్తనాలను రైతులకు వందశాతం సబ్సిడీపై అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాధార పంటలుగా పప్పుధాన్యాలను సాగుచేసి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పప్పుధాన్యాల సాగు చేయడంతో పంట పూర్తయిన తర్వాత ఆకురాలి భూసారం పెరుగుతుందన్నారు. రైతులకు ప్రభుత్వం ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేస్తోందని.. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సునీల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, ఏఎంసీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గణేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు నరేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ అనురాధ

కళాశాలల బంద్ విజయవంతం

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

చేవెళ్ల: కళాశాలల్లో పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చేపట్టిన 72 గంటల బంద్ మొదటిరోజు విజయవంతమైందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రాజేశ్ అన్నారు. పీడీఎస్‌యూ 72 గంటల బంద్‌లో భాగంగా మండలంలోని పలు కళాశాలలను వారు బుధవారం బంద్ చేయించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 2024–25 సంవత్సరానికి సంబంధించి 7,200ల కోట్ల రూపాయల బకాయిలు ఉన్నట్లు తెలిపారు. వీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు దోహదం చేయాలన్నారు. ఈ బంద్‌ను మొదటిరోజు విజయవంతం చేశారని, ఇంకా రెండు రోజులు కూడా బంద్‌పాటించి సహకరించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగిరాకపోతే పెద్ద ఎత్తున విద్యార్థులతో కలిసి పోరాటం చేసేందుకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, అశోక్, ప్రభాస్, లోకేశ్, జశ్వంత్, నందీశ్వర్, విద్యార్థులు ఉన్నారు.



కళాశాలల బంద్‌ను నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు